# సమయ స్ఫూర్తి

శ్రీమతి జి. రామలక్ష్మి, హైద్రాబాద్.

ఒకసారి అక్బర్ పాదుషాకి - తన పళ్లన్నీ ఊడి రాలిపోయినట్లు - వింతకల వచ్చింది! ఆ మర్నాడు సభలో ఆస్థాన జ్యోతిష్కుడ్ని తన కలకు అర్థం ఏమిటని ప్రశ్నించాడు - అక్బర్!

"ప్రభూ ఇది చాలా చెడ్డకల. మీ కళ్లముందే మీ కుటుంబంలోని 'వారందరూ చచ్చిపోతారని - దీని అర్థం!" అంటూ సమాధానమిచ్చాడు ఆస్థాన జ్యోతిష్కుడు.

తన వాళ్లందరూ చస్తారన్నందుకు అక్బర్‌కి ఆ జ్యోతిష్కుడిమీద పట్టరానికోపం వచ్చింది. ఒక క్షణంకూడా ఆలస్యం చేయకుండా "వెంటనే యితడ్ని తీసుకెళ్లి ఏనుగుచేత తొక్కించి మరీచంపండి!" అని ఆజ్ఞాపించాడు.

ఇంతలో బీర్‌బల్ సభలో ప్రవేశించాడు. పాదుషా తన కల గురించి చెపుతూ, జ్యోతిష్కుడ్ని అడిగిన ప్రశ్నే బీర్‌బల్‌ని కూడా అడిగాడు - బీర్‌బల్‌కి చావు మూడిందనుకుని! - అతడేం సమాధానం చెపుతాడా - అని ఆత్రంగా చూడసాగారు సభికులు!

"ప్రభూ, కలనుబట్టి మీ కుటుంబంలో అందరికంటే మీకే ఎక్కువ ఆయుస్సని తెలుతోంది!" అన్నాడు బీర్‌బల్ సమయస్ఫూర్తిగా.

వెంటనే అక్బర్ సంతోషంతో మెడలోని ముత్యాలహారంతీసి బీర్‌బల్‌కి బహూకరించాడు. ఆస్థాన జ్యోతిష్కుడు చెప్పిన విషయాన్నే సమయస్ఫూర్తిగా చెప్పి చావు తప్పించుకుని బహుమతి పొందిన బీర్‌బల్ తెలివికి మెచ్చుకున్నారు సభికులంతా.

